# కాంగ్రెస్‌కు ఓటేస్తే.. మళ్లీ కట్‌కటాలే..

## మూడు గంటల కరెంట్.. 10 హెచ్‌పీ మోటర్లు..


**ఎద్దు, ఎవుసం తెల్వని రేవంత్ పిచ్చికూతలు**

- 10హెచ్‌పీ మోటర్లు పెట్టాలంటే వేల ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం
- పీసీసీ చీఫ్ వ్యాఖ్యలపై మండిపడుతున్న రైతులు
- ధరణితో దళారులకు చెక్‌పడింది
- సాఫీగా భూముల రిజిస్ట్రేషన్లు
- నాటి విద్యుత్ కోతలు, భూ సమస్యలను గుర్తు చేసుకుంటున్న అన్నదాతలు

## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

**కాంగ్రెసోళ్లు కర్షకులపై** కుట్రలు చేస్తూనే ఉన్నరు. మరో పిడుగు వేయడానికి మన ముందుకొస్తున్నరు. రైతన్నలపై ఆర్థిక భారం మోపడానికి రెడీ అవుతున్నరు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డేమో వ్యవసాయానికి మూడు గంటల కరెంటే సాలంటడు. మరో కాంగ్రెస్ నాయకుడేమో ధరణిని రద్దుచేస్తమంటున్నడు. బాయిలకాడ 3, 5 హెచ్‌పీకి బదులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని అంటున్నడు. హస్తం పార్టీలో ఎవరికీ తోచిన విధంగా వారు మాట్లాడుతున్నరు. అసలు వీరిలో ఎవరైనా ఎవుసం చేసినోడు ఉంటే అవగాహన ఉండేది. అందరూ అవగాహన రాహిత్యంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నరు. టెన్ హెచ్‌పీ మోటర్లు పెడితే రెండు పంటలకు వచ్చే నీరు ఒక్క పంటకే సరిపోతుందని, రెండో పంటకు నీరెక్కడి నుంచి తెస్తారని ప్రశ్నిస్తున్నరు. భూగర్భ జలాలు ఎండిపోతే తాగు, సాగు నీరుకు కష్టమవు తోందని మండిపడుతున్నరు. 10 హెచ్‌పీ మోటర్లు వద్దే వద్దు.. తెలంగాణ సర్కారు ఇస్తున్న 24 గంటల కరెంటే ముద్దని తెగేసి చెప్తున్నరు. రైతులతోపాటు మోటర్ మెకానిక్‌లు, విద్యుత్ అధికారులు, భూగర్భ జలాల నిపుణులు 10 హెచ్‌పీ మోటర్లను వ్యతిరేకిస్తున్నరు. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితో దళారులకు చెక్‌పడింది. స్లాట్ బుక్ చేసుకుంటే నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ సాఫీగా సుకుంటున్నరు.ఇంటికే పాస్‌బుక్ వచ్చేలా ప్రభుత్వం పోర్టల్‌ను తయారు చేసింది. దీంతో రైతుల భూముల బాధలు తప్పాయి.

*- సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నవంబర్ 20*



### మొదటి మడి కూడా పారదు



సిద్దిపేట, నవంబర్ 20: కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లు రైతులకు మూడు గంటలు ఇస్తే మొదటి మడి కూడా పారదు. గతంలో కాంగ్రెస్ పాలనలో విద్యుత్ కోసం అరిగోస పడ్డం. రాత్రిపూట విద్యుత్‌తో తెల్లందాక బాయిలకాడ ఉండి పొలం పారించుకున్నాం. అప్పుడు సింగిల్ ఫేస్ విద్యుత్ ఉండే. దీంతో విద్యుత్ లోడ్ సరిపోక మోటర్లు కాలిపోతుండే. మరోపక్క హరి గోస ఉంటుండే...ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే రైతులే మరమ్మతులు చేయించుకునేది. మళ్లీ కాంగ్రెస్ పాలన వస్తే ఇబ్బంది తప్పదు. మూడు గంటల విద్యుత్‌తో మొదటి మడి పారదు. నాకు రెండు ఎకరాలు ఉంది. మూడు గంటల విద్యుత్‌తో పొలం పారదు.

*-దాసరి కనకయ్య, కాళ్లకుంట, సిద్దిపేట*

### వ్యవసాయం గురించి ఆయనకు ఏం తెలుసు



ఎన్ని గంటల కరెంట్ అవసరమో వ్యవసాయం చేసేటోళ్లకు తెలుస్తది..వ్యవసాయం గురించి రేవంత్‌రెడ్డికి ఏం తెల్వదని అర్థమైంది. ఇంకా ఆయన రైతులకు ఏం చేస్తాడు.. మూడు గంటల కరెంట్‌తో మొదటి మడి కూడా తడవదు. ఇంకా ఎకరాలు ఎక్కడ పారుతాయో ఆయనే చెప్పాలి. తెలంగాణ వచ్చిన తర్వాత కరెంట్ మంచిగా ఉంటుంది. మునుపు కాంగ్రెస్ ఉన్నప్పుడు కరెంట్ కోసం బాయిలకాడ పండుకునేది. మళ్లీ గట్ల గిట్ల చేస్తడా ఏంది గీ రేవంత్‌రెడ్డి. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలదు.

*- పుల్ల మల్లయ్య, రైతు, పోసాన్‌పల్లి*

### 10హెచ్‌పీ మోటర్లతో ఇబ్బందే



రైతులు ఎక్కువగా 5హెచ్‌పీ మోటర్లు వాడుతుర్రు. 10హెచ్‌పీ మోటర్లు వాడితే ఇబ్బందే. మోటర్లు కాలిపోయే ప్రమాదం కూడా తప్పదు. మళ్లీ 10 హెచ్‌పీ మోటర్ల భారం రైతులు మోయలేరు. 10హెచ్‌పీ మోటరుకు సుమారు రూ.80 వేలు ఉంటుంది. 10 హెచ్‌పీ మోటర్ల వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు కూడా కాలిపోయే అవకాశం ఉంటుంది. మొత్తం మీద 10 హెచ్‌పీ మోటర్ల వల్ల లాభాల కంటే నష్టాలే ఎక్కువ

*- బచ్చల బాబు, మోటరు మెకానిక్, గురువన్నపేట*

### సీఎం కేసీఆర్ పుణ్యమే



మర్కూక్, నవంబర్ 20: సీఎం కేసీఆర్ పుణ్యమా అని రైతులందరూ సంతోషంగా ఉన్నారు. 10 ఎకరాల్లో వరిసాగుచేశా. కొండపోచమ్మ ప్రాజెక్టు నిర్మాణం వల్ల బోరు,బావుల్లో నీటిమట్టం బాగా పెరిగింది. దీనికి తోడు 24 గంటల ఉచిత కరెంట్ కూడా ఇస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో తొమ్మిది గంటల విద్యుత్ కూడా సక్రమంగా ఇవ్వలేదు. ఆ కరెంట్ కూడా పొద్దుమాపు నాలుగుసార్లు వచ్చిపోయేది. నేడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. నేడు రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా, పంటరుణమాఫీ చేయడం సంతోషం.

*-బిలకంటి వెంకట్‌రెడ్డి, రైతు, ఎర్రవల్లి (సీఎం కేసీఆర్ దత్తత గ్రామం)*

### కరెంట్ పోతనే లేదు



సిద్దిపేటరూరల్, నవంబర్ 20: కేసీఆర్ దయ వల్ల కరెంట్ పోతనే లేదు. 24 గంటలు వస్తుంది. కాంగ్రెస్ నాయకులకు ఎవుసం అంటే తెల్వదు. మడిల నాగలేసి దున్నితే తెలుస్తది. ఎకరం పొలం పారాలంటే ఎంత టైం పడుతదో వాళ్లకు తెలుసా.. కేసీఆర్ హయాంలో కాలం అయింది. పంటలు బాగా పండుతున్నాయి. ఉచితంగా 24 గంటలు కరెంట్ ఉంటే ఎప్పుడంటే అప్పుడు పొలానికి నీళ్లు పారియవచ్చు. ఇన్నిరోజులు రైతులను పట్టించుకోని కాంగ్రెసోళ్లు ప్రేమ చూపెడుతుర్రు. కేసీఆర్ ఎవుసం చేసిన వ్యక్తి కాబట్టి రైతులను ఆదుకుంటున్నాడు.

*- జెల్ల మల్లయ్య, రైతు, చింతమడక, సిద్దిపేటరూరల్*

### కరెంట్ లేకపోతే ఎవుసం ఉత్తదే



సిద్దిపేటరూరల్, నవంబర్20: నాకు ఆరు ఎకరాలు ఉంది. రైతు బంధు వస్తుంది. కరెంట్ 24 గంటల ఇస్తున్నారు. ఎవుసానికి కరెంట్ లేకపోతే ఉత్తదే. కాంగ్రెసోళ్లు చెబుతున్నట్లు 3, 4 గంటలు ఇస్తే సరిపోదు. రాసులకొద్ది వడ్లు పండుతున్నాయంటే కరెంట్ 24 గంటలు ఇస్తేనే పండుతున్నాయి. అక్కడ వేరే రాష్ట్రంలో(కర్ణాటక) కాంగ్రెస్ వచ్చిందట.. 3 గంటలు కరెంట్ ఇత్తుర్రు అని ధర్నాలు, రాస్తారోకోలు చేస్తుర్రు. ఇవన్ని తెలంగాణలో ఎవుసం చేసే మాకు తెలుస్తలేదనుకుంటే పొరపాటు. కాంగ్రెస్ కంటే బీఆర్‌ఎస్ గవర్నమెంట్ మంచిది. పెద్దసార్ కేసీఆర్ సీఎంగా ఉంటేనే అన్ని అయితాయి. కాంగ్రెస్,టీడీపీవాళ్లు గతంలో ఉన్నప్పుడు ఒక్క దొయ్య కూడా పారేదికాదు. గతంలో చాలా ఇబ్బంది పడ్డం. తెలంగాణ తెచ్చిన కేసీఆర్ కరెంట్ ..సాగు నీళ్ల కష్టాలు లేకుండా చేసిండు. మళ్లీ కాంగ్రెస్ వస్తే బాయిలకాడ రాత్రిపూట కరెంట్ కోసం పోవాల్సి వస్తది. కాంగ్రెస్ రావొద్దు.. కరెంట్, సాగునీళ్లు రాకుంటే పచ్చని పొలాలు ఇట్ల కనిపిస్తయా?.

*- గిట్టని మల్లయ్య, చింతమడక, రైతు, సిద్దిపేటరూరల్*

### 10 హెచ్‌పీ ముచ్చటేలేదు



హుస్నాబాద్ టౌన్, నవంబర్ 20: 50 ఏండ్ల నుంచి చూస్తున్న టెన్‌హెచ్‌పీ ముచ్చటే లేదు... ఏ కరెంట్‌అధికారి, మంత్రులు కూడా ఈ ముచ్చట ఎన్నడూ చెప్పలేదు. రేవంత్‌రెడ్డి నుంచే ఈ ముచ్చట వింటున్నా. అసలు బాయిలకు టెన్‌హెచ్‌పీ మోటర్లు అవసరం లేదు.. దానికి తగ్గట్టు బావులు ఉన్నాయా.. రేవంత్‌రెడ్డికి ఏమీ అవగాహన లేదు... ఆయన మాటలు ఎవలకు అర్థంకావడం లేదు. ఒకప్పుడు కరెంట్ సక్కగలేక మోటర్లు కాలిపోతుండే. వాటికి మరమ్మతులు చేయడానికి టైం కూడా ఉండకపోయేది. నాదగ్గర ఇద్దరు పనిచేసేటోళ్లు...ఇప్పుడు ఒక్కడికే పనిఉండటం లేదు. నెలకు రెండు మోటర్లు కూడా రావడం లేదు. కరెంట్ మంచిగ ఇస్తున్నారు. మోటర్లు కాలిపోవడం లేదు.

*- గంగం రాంరెడ్డి , మోటర్ మెకానిక్ ,హుస్నాబాద్‌టౌన్*

### కరెంట్‌కోసం తెల్లందాక ఉరికేది



హుస్నాబాద్‌టౌన్, నవంబర్ 20: కరెంట్‌కోసం రైతులందరూ బాయిలకాడికి తెల్లందాక ఉరికేది..ఆడనే పండుకుని కరెంట్ వచ్చిన తర్వాత పెట్టుకునేది. ఊకే ట్రిప్పయ్యేది. పారిందే పారుడు ఉండే... చాలాసార్లు పొలం ఎండిపోయేది... ఒకసారి రెండు ఎకరాల పొలం ఎండిపోయి మస్తు నష్టమైంది. తొమ్మిదిగంటల కరెంట్‌కు ఐదుగంటలు కూడా ఇయ్యలేదు. మస్తుమార్లు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే మనిషికి ఇన్ని పైసలు ఏసుకొని రిపేరు చేయించేది. మూడు గంటల కరెంట్ ఏమూలకు సరిపోతది. అన్ని తప్పుడు ముచ్చట్లు చెప్పి రైతులను ఆగం చేస్తున్నాడు. మూడుగంటల కరెంట్‌తోని రెండుమల్లు కూడా పారవు. ఇప్పుడిస్తున్న 24 గంటల కరెంట్ పొద్దాకనే మంచిగ వస్తుంది. ఇప్పుడు కేసీఆర్ ఇస్తున్న కరెంట్ వల్ల రైతులకు ఇబ్బంది లేదు. మా దగ్గర ఎప్పుడు కూడా ట్రాన్స్‌ఫార్మర్ కాలలేదు.. ఫీజు వైరు పోలేదంటే కరెంట్ ఎట్ల వస్తుందో చూడండి.

*-నమిలికొండ రాములు, రైతు, హుస్నాబాద్‌టౌన్*

### రైతులను ఆగం చేయకండి



హుస్నాబాద్‌టౌన్, నవంబర్ 20: రాత్రి పూట కరెంట్‌కోసం బావుల దగ్గరే పండుకునేది.మస్తు కష్టపడ్డం. కరెంట్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసేది. రాత్రి పూట కరెంట్ వల్ల ఇబ్బందులు పడేది. అప్పుడప్పుడు అసలు కరెంటే రాకపోతుండే... ఎవుసం చేసుడు అంటేనే రంది ఉండేది. ఎట్లఅని తిప్పలు పడుకుంటూ రాత్రి పూట కరెంట్ పెట్టుకున్నాం. కాలం, కరెంట్ సరిగ్గా లేక తిప్పలు పడ్డం. మూడుగంటల కరెంట్ అని చెప్పేటోళ్లకు వ్యవసాయం చేస్తే తెలుస్తది.ఇప్పుడు 24 గంటల కరెంట్ వస్తుంది. రైతులను ఆగం చేయకండ్రి... తప్పుడు మాటలు చెప్పి రైతులను ఆగం చేసుడు మానుకోవాలి.

*- అయిలయ్య, రైతు, హుస్నాబాద్‌టౌన్*

### బంగారు పంటలు పండుతున్నాయి

సిద్దిపేట కమాన్, నవంబర్ 20 : ఇప్పుడు బంగారు పంటలు పండుతున్నాయి. నీళ్లకు ఇబ్బంది లేకుండాపోయింది.. మా భూమి పక్కనే రంగనాయకసాగర్ రిజర్వాయర్ ఉంది. సాగుకు సమస్య లేకుండా 24 గంటల కరెంట్ వస్తున్నది. ఇబ్బంది లేకుండా ఎవుసం చేసుకుంటున్నాం. గీ కాంగ్రెసోళ్ల ముచ్చట రోజుకో తీరు కనబడుతుంది. వాళ్లు అధికారంలోకి రాక ముందే పెద్దరికానికి పోటీ పడుతున్నారు. నాడు రోశయ్య.. కిరణ్‌కుమార్‌రెడ్డి ఇలా సీఎం కుర్చీ కోసం పోటీ పడ్డారు. మళ్లీ గట్లనే అయితది. కాంగ్రెసోళ్ల మాటలు అన్నీ అబద్ధాలే. వారు పరిపాలించినప్పుడు రైతులు అరిగోస పడ్డారు. రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్ చాలని ఎట్లా మాట్లాడుతాడు. ఏ రైతును అడిగినా మూడు గంటలు చాలని ఒక్కరు కూడా అనరు. నాడు కరెంట్ కోసం వేచిచూశాం. నేడు ఆపరిస్థితి లేదు. రైతులకు తెల్వదా.. వీళ్లు ఏం మాట్లాడుతున్నారో.. ఎద్దు తెల్వదు.. ఎవుసం తెల్వదు.. కానీ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ, 7 హెచ్‌పీ మోటర్లు నడిపిస్తం.. 10 హెచ్‌పీ మోటారు పెట్టుకుంటే నడుస్తదా.. కాంగ్రెసోళ్లకు ఏం అవగాహన లేదు. వాళ్లు ఒక వేళ పొరపాటున గెలిస్తే రైతుల బతుకులు ఆగమే. గతంలా కరెంట్ కోతలతో రైతులంతా అల్లాడిపోయారు.



*- జక్కుల ఎల్లయ్య, రైతు, ఇమాంబాద్, సిద్దిపేట*

### కాంగ్రెస్‌ను నమ్ముకుంటే కథ ఆగమే



సిద్దిపేట కమాన్, నవంబర్ 20: కాంగ్రెస్‌ను నమ్ముకుంటే కథ ఆగమే. ఇది వరకే వాళ్ల మాటలు నమ్మి.. ఎన్నో సార్లు గెలిపించాం.. ఆనాడు ఎవుసం చేయడానికి ఇబ్బందులు పడ్డాం. తాపతాపకు కరెంట్ పోవుడు ఉంటుండే.. పండుగ లేదు.. పబ్బం లేదు.. బాయికాడ పొలానికి నీళ్లు పెట్టడానికి కాపు కాసేది. ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ మీద 30, 40 విద్యుత్ కనెక్షన్ ఉంటుండే.. లోడ్ పడి ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు కాలిపోతుండే. కాలిందంటే మరమ్మతులు చేయించేవరకు పంటలు ఎండిపోతుండే. సరిగ్గా కరెంట్ ఇయ్యక రైతులు అష్టకష్టాలు పడ్డారు. ఒకసారి 9 గంటలు, మరోసారి 7 గంటలు లాస్ట్‌కు 6 గంటలు కూడా సక్రమంగా ఇయ్యలేదు. గతం యాదికొస్తే కండ్ల ముందు అప్పటి కష్టం కనబడుతుంది. ఒక్కోసారి సరిగ్గా పారక బర్లమేతకు వదిలేసిన రోజులు కూడా ఉన్నాయి. కాంగ్రెస్ నాయకులు మళ్లీ ధరణి గురించి మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణిని తీసేస్తమంటున్నారు. ధరణి మంచిది కాదా..? ఎందుకు మంచిది కాదు..? మన భూమి ఆగం కాకుండా చేసిండు. మనం సంతకం చేయంది మన భూమి ఇంకో వ్యక్తికి మారదు. ఇది మంచిది కాదా.. రైతుల చేతిలోనే అధికారం ఉంది. ధరణి ఉంటేనే మన భూమికి భద్రం.. ఇది ఖచ్చితంగా ఉండాల్సిందే. కాంగ్రెస్‌ను ఎవరూ నమ్మరు.. వాళ్లు చిల్లర మాటలు మాట్లాడుతున్నారు.

*-కాసిరెడ్డి నర్సింహారెడ్డి, రైతు, ఇమాంబాద్, సిద్దిపేట*

### రాత్రి కరెంట్‌తో మస్తు ఇబ్బంది



చిన్నకోడూరు, నవంబర్ 20: గతంలో వచ్చిపోయే కరెంట్‌తో మస్తు ఇబ్బంది పడ్డాము. దొంగరాత్రి ఇచ్చే కరెంట్‌తో పాములు, తేళ్లు కుడితే మస్తు మంది రైతులు చనిపోయిండ్రు. పంటలు ఎండుతున్నాయని రోడ్ల మీదికి వచ్చి ధర్నాలు చేశాం. ఎవుసం గురించి తెల్వని కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంట్ మస్తు అయితుందని మాట్లాడుతుండ్రు. కానీ రైతుల బాధలు తెలిసిన కేసీఆర్ సారు తెలంగాణ తెచ్చిన తర్వాత 24 గంటల కరెంట్ ఇస్తుండు. రైతులందరూ పొద్దుందాకనే కరెంట్ పెట్టుకొని మంచిగా పంటలు పండించుకుంటున్నారు. 24 గంటల కరెంట్ ఇవ్వకుంటే పంటలు ఎండినట్లే...

*- బొమ్మకంటి రామస్వామి, రైతు, రామునిపట్ల*

### మూడు దొయ్యలు పారవు



సిద్దిపేట కమాన్, నవంబర్ 20 : మొన్నటి దాకా ఎవరూ కనిపించలేదు. ఇప్పుడు ఎన్నికలు రాగానే కాంగ్రెసోళ్లు కనబడుతున్నారు. అసలు వ్యవసాయరంగానికి మూడు గంటల కరెంట్ చాలంటున్నారు. ఎట్ల పారుతాయి అనుకుంటున్నరు వీళ్లు. మూడు గంటల కరెంట్‌తోమూడు దొయ్యలు కూడా పారవు. తెలిసి మాట్లాడుతున్నారా..? తెలువక మాట్లాడుతున్నారా..? అర్థం కావడం లేదు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ ఎట్లుండేదో మనం చూశాం. అర్ధరాత్రి కరెంట్ వచ్చేది. ఆ రాత్రి తిప్పలపడుకుంటూ బావుల కాడికి పోయిన రోజులు రైతులు మర్చిపోలేదు. కాంగ్రెస్ వస్తే మళ్లీ పాతరోజులు వస్తాయి. రైతులు ఎవరూ కాంగ్రెస్‌కు ఓటువేయరు. కాంగ్రెస్ నాయకులు పగటి కలలు కంటున్నారు. కాంగ్రెసోళ్లు ఎన్నికలు అయిపోయిన తర్వాత ఎవరూ కనిపించరు.

*- మేడిశెట్టి తారాబాయి, మహిళా రైతు, ఇమాంబాద్, సిద్దిపేట*

### మొదటిదొయ్యకూడా పారదు



మర్కూక్, నవంబర్ 20: మూడు గంటల కరెంట్‌తో మొదటిదొయ్యకూడా పారదు. ఇదివరకు 16 ఎకరాల్లో పంటలు సాగుచేస్తే నష్టమే ఎక్కువ జరిగింది. చాలీచాలని కరెంట్‌తో పంటలన్నీ ఎండిపోయాయి. కానీ కేసీఆర్ సారు ముఖ్యమంత్రి అయిన తర్వాత మాలాంటి రైతులకు మేలు జరిగింది. పంటలు పండించుకునేందుకు 24 గంటల కరెంట్ సరఫరా చేస్తున్నారు. రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. పల్లెల్లోనే వరిధాన్యం కొనుగోలు చేయడం సంతోషం. ప్రస్తుతం ఆయిల్‌పామ్ పంట సాగుచేస్తున్నా. వ్యవసాయం గురించి తెలియని వాళ్లకు ఏంచెప్పినా అర్థంకాదు.

*- మొర్సు జీవన్‌రెడ్డి, రైతు, మర్కూక్*

### ధరణి మా ధైర్యం

సిద్దిపేటరూరల్, నవంబర్20: కాంగ్రెస్ వచ్చేది లేదు..సచ్చేది లేదు.. ధరణితో దళారులకు చెక్‌పడింది. గ్రామాల్లో గుంట భూమి కొంటే దాని పాస్‌బుక్ కోసం ఏండ్లుగా తహసీల్ కార్యాలయం చుట్టూ తిరిగిన సందర్భాలు ఉన్నాయి. ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి పాస్‌బుక్ ఇప్పించాలని అడిగేవాళ్లం. ఒక్కోసారి తహసీల్దార్, వీఆర్‌వోలకు చెప్పినా పని కాకపోయేది. తగాదాలు, కుటుంబాల్లో గొడవలు కోర్టుల్లో కేసులు కూడా వేసుకునేవాళ్లం. కానీ తెలంగాణ ప్రభుత్వం వచ్చాక సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా ధరణి పోర్టల్‌ను తెచ్చిండు. ఇది చిన్న,సన్నకారు రైతులకే కాదు.. భూమి ఎవరు కొన్నా గంటలో పాస్‌బుక్, పహణీ, మ్యుటేషన్ అయితుంది. అసలు ధరణితో భూమి సమస్యలు తగ్గిపోయాయి. అంతకుముందు కబ్జాలో ఉన్న వారిపై భూమి బదలాయించిన సందర్భాలు కూడా ఉన్నాయి. భూమి యజమానులు ఎక్కడో ఉండేవారు. ఏదోఒక పేపర్ సృష్టించి మేమే కొన్నామని చెప్పి పాస్‌బుక్‌లు తయారు చేయించేవారు. దీంతో అసలు యజమాని వచ్చి చూసేదాక భూమి తన పేరుమీద లేదనే విషయం తెలియకపోయేది. ఇప్పుడంతా ఆన్‌లైన్ చేయడంతో ఎక్కడ ఉన్నా భూమి వివరాలు పోర్టల్‌లో చూసుకునే వీలు కల్పించిండ్రు. గిదంతా అయితదా అనిపించేది. ఒక్కోసారి ఆశ్చర్యం కలుగుతుంది. స్లాట్ బుక్ చేసుకుంటే నేరుగా తహసీల్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ సాఫీగా చేసుకొని ఇంటికి వచ్చి హాయిగా నిద్రపోతున్నాం. ఏ అధికారి వద్దకు, ఏ కార్యాలయం వద్దకు పోనక్కర్లేకుండానే ఇంటికే పాస్‌బుక్ వచ్చేలా పోర్టల్‌ను తయారు చేసిండ్రు. అంతకుముందు పాస్‌బుక్ కావాలంటే పైసలు తీసుకునేటోళ్లు. దీంతో చాలామంది రైతులు ఇబ్బందులుపడేవారు. ఇప్పుడు దర్జాగా పాస్‌బుక్ ఇంటికే చేరడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. నిజంగా సీఎం కేసీఆర్‌కు తెలంగాణ రైతాంగం రుణపడి ఉంటారు. ఇంత మంచి పోర్టల్‌ను తెచ్చిన సీఎం కేసీఆర్‌కు చేతులెత్తి మొక్కాలే. కాంగ్రెస్ నాయకులకు ఏం విమర్శించాలో తెలియక ఏదోఒక విషయాన్ని పట్టుకొని గాయి.. గాయి చేత్తుర్రు. కేసీఆర్ తెచ్చిన పోర్టల్‌ను తీసేస్తే మళ్లీ పాతరోజుల్లోగా రైతులు పొలాన్ని ఇడిసి పెట్టి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే. భూ హక్కులు పక్కాగా చేసిన ధరణి పోర్టల్ ఉండాల్సిందే. పోర్టల్‌తో దళారుల జేబులకు బొగ్గపడిందని కొందరు దీన్ని తీయాలె అంటుర్రు. ఇది కరెక్ట్ కాదు. ధరణి ఇవాలా రైతులకు ధైర్యాన్ని కల్పిస్తున్నది.



*- జగ్గా లక్ష్మారెడ్డి, రైతు, బండచెర్లపల్లి, సిద్దిపేటరూరల్ మండలం*





### ధరణి తీసేస్తే రైతుల బాధలు మొదటికొచ్చినట్లే



చిన్నకోడూరు, నవంబర్ 20: తెలంగాణ కాక ముందు ఆఫీసుల చుట్టూ తిరిగినా రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేదికాదు. రాత్రికి రాత్రే ఒకరి భూమి మరొకరి పేరు మీదికి మారేది. ఎవరు పైసలిస్తే వారి పనులు చేసేది. భూముల సమస్యలతో ఎంతో మంది రైతులు కోర్టులు, ప్రాణాలు పోగొట్టుకున్నారు. సీఎం కేసీఆర్ సార్ రైతు కాబట్టి పెద్ద మనసుతో ఆలోచన చేసి ధరణి పోర్టల్ తీసుకొచ్చారు. మనం ఎక్కడ ఉన్నా మన భూమిని ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు. ధరణి వల్ల మోసాలు జరగడం లేదు. ధరణి తేవడం వల్లనే భూముల ధరలు బాగా పెరిగాయి. ధరణి తీసేస్తే రైతుల బాధలు మళ్లీ మొదటికి వచ్చినట్లే.

*-పడిగె లింగం, యువరైతు, కస్తూరిపల్లి*

